ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

3

వనపర్తి

జిల్లా వార్తలు

గురువారం 20 జూన్ 2024



పేదల గుండె పదిలం

ఎదురుచూపులు

- మంజూరైనా నిర్మాణంకాని మామిడి క్లస్టర్
- 2021లో ఉమ్మడి జిల్లాకు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం
- రూ. 172.3 కోట్ల నిధులు కేటాయింపు
- మూడేళ్లయినా మొదలుకాని పనులు
- స్థానికంగా మార్కెట్ లేక రైతులు ఇక్కట్లు
- మోదీ మూడోసారి ప్రధానికావడంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- ఉమ్మడి జిల్లాలో 57,344 ఎకరాల్లో మామిడి తోటలు





కొల్లాపూర్‌లో సాగు చేసిన మామిడి తోట



కేసరి రకం కాయలు

కొల్లాపూర్, జూన్ 19: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన మామిడి క్లస్టర్ మూడేళ్లుగా నిర్మాణానికి నోచుకోవడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17,284 మంది మామిడి రైతులు 57,344 ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఏటా 2,29,380 మెట్రిక్ టన్నుల మామిడి దేశ విదేశాలకు ఎగుమతి అవుతోంది. మామిడికి స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు నిర్ణయించిన ధరకే పంటను అమ్ముకుని అప్పులపాలవుతున్నారు. దాంతో రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన కొల్లాపూర్ మామిడిని ప్రోత్సహించేందుకు 2021లో క్లస్టర్ ఏర్పాటుకు కేంద్రం రూ.172.3 కోట్లను మంజూరు చేసింది. కానీ నేటికీ పనులే ప్రారంభం కావడం లేదు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినందున క్లస్టర్ నిర్మాణాన్ని చేపడతారని రైతులు ఆశిస్తున్నారు.

రైతులకు చేకూరనున్న మేలు

మామిడి క్లస్టర్ ఏర్పాటుతో రైతులకు ఎంతో మేలు చేకూరనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మామిడి నర్సరీలను ఏర్పాటు చేయనున్నారు. మామిడి కాయలు, పండ్లు ఎగుమతి చేసేందుకు ట్రాన్స్‌పోర్టు వాహనాలను సిద్ధం చేస్తారు. మార్కెటింగ్ సర్వీస్‌ను కల్పించనున్నారు. మామిడిని నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీలు నిర్మించనున్నారు. కొనుగోలు, ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. మామిడి ప్యాకింగ్, పల్పింగ్ మార్కెట్‌ను కల్పిస్తారు. తోటల అభివృద్ధితో పాటు మొక్క నాటిన నాటి నుంచి కాయ అయ్యే వరకు రైతులకు సదుపాయాలు కల్పిస్తారు.


2021లో మంజూరు

ఉమ్మడి జిల్లాకు 2021లో మామిడి క్లస్టర్ మంజూరైంది. రూ.172.3 కోట్లు మంజూరు కాగా.. అందులో సబ్సిడీ ద్వారా కేంద్రం 73 కోట్ల 26 లక్షలు చెల్లిస్తుంది. ఏజెన్సీ 98 కోట్ల 77 లక్షలు భరించాల్సి ఉంది. నిర్మాణం తర్వాత ఆ డబ్బులను క్లెయిమ్ చేసుకోవాల్సి ఉంటుంది. కానీ టెండర్లకు ఎవరూ ముందుకు రాకపోవడంతో క్లస్టర్ ఏర్పాటు పనులు ప్రారంభం కాలేదు. చివరికి హైదరాబాద్‌కు చెందిన ప్రసాద్ సీడ్స్ వారు టెండర్లు చేజిక్కించుకోవడంతో పనులు ప్రారంభమవుతాయని ఎదురు చూసిన రైతులకు నిరాశే మిగిలింది.

నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించడంతో మామిడి క్లస్టర్ నిర్మాణ పనులు మొదలవుతాయని రైతులు ఎదురు చూస్తున్నారు.

మూడు విభాగాలుగా నిర్వహణ

ఈ క్లస్టర్‌ను మూడు విభాగాలుగా నిర్వహించనున్నారు. పంటకు ముందు, కాయ తెంపిన తర్వాత, మార్కెటింగ్.. ఇలా నిర్వహిస్తారు. కొల్లాపూర్ మామిడిని ఒక బ్రాండ్‌గా మార్చి, దేశ విదేశాల్లో మార్కెటింగ్ చేసేలా క్లస్టర్ రైతులకు తోడ్పాటును అందించనుంది. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లా మామిడి రుచులు ప్రపంచ వ్యాప్తంగా పరిచయం అవుతాయి.



ప్రసిద్ధి గాంచిన కొల్లాపూర్ బేనిషాన్ మామిడి కాయలు(ఫైల్)

కష్టాలు తీరతాయి



కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన మామిడి క్లస్టర్ నిర్మాణం అయితే వచ్చే ఏడాదైనా మామిడి రైతులకు మేలు కలుగుతుంది. లక్షల రూపాయలు పోసి తోటలను సాగు చేస్తుండగా ఒక వైపు తెగుళ్లు, మరో వైపు సరైన గిట్టుబాటు ధర అందక ఏటా నష్టపోతున్నాం. క్లస్టర్ ఏర్పాటు చేస్తే ఆ కష్టాలు తీరుతాయని ఆశిస్తున్నాం.

- పి.నాగన్న, మామిడి రైతు, బావాయిపల్లి

గిట్టుబాటు ధర దక్కుతుంది



కుటుంబం మొత్తం కష్టపడి పండించిన మామిడి పంటను విక్రయించేందుకు నానా పాట్లు పడాల్సి వస్తోంది. స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో విక్రయించేందుకు పట్నం పోక తప్పడం లేదు. దళారులు నిర్ణయించిన ధరలకే విక్రయించక తప్పడం లేదు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మామిడి క్లస్టర్ ఏర్పాటైతే మామిడి రైతులకు మంచి రోజులు వస్తాయి. గిట్టుబాటు ధర దక్కుతుంది.

- మల్లయ్య, మామిడి రైతు, తీగలపల్లి



మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి

- గుండెపోటుకు జనరల్ ఆస్పత్రిలో ఉచితంగా ఇంజక్షన్
- ప్రైవేటు ఆస్పత్రుల్లో దాని ధర రూ.50 వేలు
- ఇప్పటి వరకు 88 మందికి ప్రాణదానం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) జూన్ 19: వేల రూపాయల ధర ఉండే గుండెపోటు నియంత్రణ ఇంజక్షన్ మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో అందుబాటులో ఉంది. ఉచితంగా ఇచ్చే ఈ ఇంజక్షన్ ద్వారా జనవరి నుంచి ఇప్పటి వరకు 88 మందికి ప్రాణదానం చేశారు. ఈ అవకాశాన్ని పేద ప్రజలు వినియోగించుకోవాలని ఆస్పత్రి అధికారులు సూచిస్తున్నారు. కానీ అవగాహన లోపం, ప్రాణభయంలో ప్రజలు ప్రైవేటుకు పరుగులు పెడుతున్నారు. ఇదే ఆసరాగా చేసుకొని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నాయి.



పెరుగుతున్న బాధితులు..

ఇటీవలి కాలంలో గుండె పోటు బాధితులు పెరుగుతున్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ దీని బారిన పడుతున్నారు. శారీరకశ్రమ లేకపోవడం, ఊబకాయం, అన్నింటికంటే మానసిక ఒత్తిడి కారణంతో గుండెపోటుకు గురవుతున్నారు.

జనరల్ ఆస్పత్రిలో ఉచితంగా ఇంజక్షన్

గుండెపోటు వచ్చిన వెంటనే ఎక్కువగా ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. ఆ యాజమాన్యాలు లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నాయి. అయితే ఈ ఇంజక్షన్ ఇచ్చే సౌకర్యం జనరల్ ఆస్పత్రిలో కూడా అందుబాటులో ఉంది. దానిని ఉచితంగానే ఇస్తున్నారు. గత ఏడాది నుంచే ఈ చికిత్స అందుబాటులోకి వచ్చింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి గుండెపోటు బాధితులు ఆస్పత్రికి వస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 88 మందికి ఇంజక్షన్ ఇచ్చారు. వారందరికీ ఆస్పత్రి వైద్యులు పునర్జన్మను ఇచ్చారు. అయితే గుండె నొప్పి వచ్చిన ఆరు నుంచి 12 గంటల్లోపు ఆస్పత్రికి వెళ్తే.. ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుంది.



గుండెపోటుకు ఇచ్చే ఇంజక్షన్

ప్రైవేటులో చికిత్సకు రూ.80 వేల ఖర్చు

జనరల్ ఆస్పత్రిలో ఉచితంగా ఇచ్చే ఇంజక్షన్ ధర ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటుంది. అడ్మిషన్ చేసుకొని చికిత్స అందించేందుకు మరో రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇలా ఒక్కో గుండెపోటు బాధితుడికి రూ.80 వేలకు పైబడే ఖర్చు అవుతుంది. చేసేదేమీ లేక యాజమాన్యాలు అడిగినంత ఫీజులు చెల్లిస్తూ, ప్రాణాలు కాపాడుకుంటున్నారు. అంత ధర ఉన్న ఇంజక్షన్‌ను ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా ఇవ్వడంతో ప్రాణాలు కాపాడటంతో పాటు ఆర్థికంగా చితికిపోకుండా చూస్తున్నారు.

24 గంటలు అందుబాటులో..



ఛాతిలో తీవ్రమైన నొప్పి వస్తే బాధితులు ఆరు నుంచి 12 గంటలలోపు ఆస్పత్రికి రావాలి. ఇంజక్షన్ ఇచ్చిన వెంటనే నొప్పి తగ్గుతుంది. అనంతరం వారిని ఉస్మానియా లేదా గాంధీ ఆస్పత్రులకు యాంజోగ్రామ్, స్టంట్ వేసేందుకు రెఫర్ చేస్తాం. ఆస్పత్రిలో ఇంజక్షన్ 24 గంటలు అందుబాటులో ఉంటుంది. డాక్టర్లు కూడా ఉంటారు. ఈ అవకాశాన్ని పేదలు వినియోగించుకోవాలి.

- డాక్టర్ జీవన్, ఆస్పత్రి సూపరింటెండెంట్

పనులు పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా ,జూన్ 19: అమ్మ ఆదర్శ పాఠశాల పనులు ఈనెల చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వనపర్తి జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద 345 పాఠశాలల్లో పనులు చేయిస్తున్నట్లు డీఈవో గోవిందరాజులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాల ల్లో మౌలిక సదుపాయాల పనులపై మండలాల వారిగా పూర్తి అయిన పనులు, ఇంకా పూర్తికాని పనుల వివరాలు, ఆలస్యానికి గల కారణాలను ఏఈలను ప్రశ్నించారు. తరచుగా పాఠశాలలను సందర్శించి పనుల్లో వేగం పెంచాలని, నాణ్యతలో రాజీ పడొద్దని ఆదేశించారు. సమావేశంలో సీపీవో చంద్రశేఖర రాజు, టీఎస్‌ఈ డబ్ల్యూ ఐడీసీ ఉప కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస్, పంచాయతీ రాజ్ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

● కలెక్టర్ ఆదర్శ్ సురభిని జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి బుధవారం కలిశారు. పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభిని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కలిసి సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, వనపర్తి ఎంపీపీ కిచ్చా రెడ్డి, మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సురక్షితమైన తాగునీరు

వనపర్తి రూరల్ : ప్రతీ ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం వనపర్తి మండల పరిధిలోని రాజపేట, కొత్తకోట మండల పరిధిలోని సంకిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించి మిషన్ భగీరథ సర్వే స్థితిగతులను సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. సంకిరెడ్డిపల్లి గ్రామంలో మిషన్ భగీరథ సర్వే చేసే ప్రక్రియను స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో యాదయ్య, డిప్యూటీ సీఈవో రామమహేశ్వర్, ఎంపీడీవో రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగం

- అలంపూర్ చౌరస్తాలో రూ.21 కోట్లతో ఆస్పత్రి నిర్మాణం
- ఆరు నెలల కిందట ప్రారంభం
- సిబ్బందిని కేటాయించక నేటికీ మొదలుకాని వైద్య సేవలు
- మెరుగైన చికిత్స కోసం పక్క రాష్ట్రానికి వెళ్తున్న ప్రజలు
- సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్న క్షతగాత్రులు
- రూ.10 లక్షల విలువైన సామగ్రి చోరీ



నిరుపయోగంగా ఉన్న వంద పడకల ఆస్పత్రి


అలంపూర్ చౌరస్తా, జూన్ 19: జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.21 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆస్పత్రి నేటికీ వినియోగంలోకి రావడం లేదు. 20 నెలల్లో నిర్మాణం పూర్తయిన ఈ దవాఖానాను గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల ముందు అక్టోబరు ఐదున అప్పటి మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే అబ్రహం ప్రారంభించారు. దాంతో మెరుగైన వైద్యం అందుతుందని అలంపూర్ నియోజకవర్గ ప్రజలు ఆశపడ్డారు. కానీ వైద్య సేవలను మాత్రం ప్రారంభించ లేదు.

నెరవేరని లక్ష్యం

ఉమ్మడి రాష్ట్రంలో అలంపూర్ ప్రజలు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి వెళ్లేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఇక్కడి నుంచి వెళ్లిన రోగులను అక్కడి ప్రభుత్వ వైద్యులు సరిగా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. దాంతో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటుతో నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని, జాతీయ రహదారిపై ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు వెంటనే వైద్యం అంది ప్రాణాలు నిలుస్తాయని భావించారు. కానీ ఆస్పత్రి అందుబాటులోకి రావడం లేదు. నేటికీ అలంపూర్ ప్రజలు కాన్పుల కోసం కర్నూలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు పెట్టుకుంటున్నారు.

అమలుకాని మంత్రి హామీ

నాలుగు నెలల క్రితం వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ అధికారులతో కలిసి ఆస్పత్రిని పరిశీలించారు. త్వరలో సిబ్బందిని కేటాయించి, వినియోగంలోకి తెస్తామని హామి ఇచ్చారు. కానీ నాలుగు నెలలైనా ఎలాంటి పురోగతి లేదు.



ఆక్సిజన్ రాగి పైపులను కోసుకెళ్లిన దొంగలు

ఈ నెలాఖరుకు వినియోగంలోకి తెస్తాం

వంద పడకల ఆస్పత్రిని ఈనెల ఖరుకు వినియోగంలోకి తెస్తాం. ఈ మేరకు కమిషనర్ నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చాయి. అందుకు ఆవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రతిపాదనలు పంపించాం. చోరీకి గురైన సామగ్రి ఏర్పాటుకు అవసరమైన నిధులకు కుడా ప్రతిపాదనలు పంపాం. ఆక్సిజన్ పైపులు చోరీకి గురైనా, సిలిండర్ల ద్వారా రోగికి వైద్యం అందించొచ్చు.

- ఇన్‌చార్జి డాక్టర్ సయ్యద్‌బాష



ఆస్పత్రిలో వృథాగా ఉన్న సామగ్రి

సామగ్రి అపహరణ

ఆస్పతి ప్రారంభం అయ్యాక అవసరమైన సామగ్రి కొన్ని వారాల్లోనే వచ్చింది. 100 బెడ్‌షీట్లు, ఆక్సిజన్ పరికరాలు, సెలైన్ బాటిల్ స్టాండ్స్, టేబుళ్లు, ఈజీసీ, సీటీజీ, అల్ట్రాసౌండ్ పరికరాలు, ఎక్స్‌రే, ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన సామగ్రి వచ్చాయి. కానీ నెలలు గడిచిపోతున్నా సిబ్బందిని నియమించకపోవడంతో వినియోగంలోకి రావడం లేదు. ఆస్పత్రి పరిసరాల్లో జనవాసాలు లేకపోవడంతో దొంగలు కిటికీల గ్రిల్స్ తొలగించి, రూ.10 లక్షల విలువైన సామగ్రిని దొంగిలించారని తెలుస్తోంది. ఆక్సిజన్ సరఫరా చేసే రాగి పైపులు, నీటి కొళాయిలు, టాయిలెట్ సామగ్రి, విద్యుత్ వైర్లు, లైట్స్ తదితరాలు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ సయ్యద్‌బాషా ఉండవల్లి పోలీసులకు నాలుగు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. నాటి నుంచి జిల్లా వైద్యాధికారులు ఆస్పత్రి వద్ద నలుగురు సెక్యూరిటీ గార్డులను నియమించారు.

ఎంతమంది సిబ్బంది కావాలంటే..

ఆస్పత్రిని వినియోగంలోకి తేవాలంటే డాక్టర్లు గైనకాలజిస్టులు ఐదు గురు, ఫిజీషియన్లు ఇద్దరు, చిన్నపిల్లల డాక్టర్లు ఐదుగురు, ఎంబీబీఎస్ వైద్యులు ఆరుగురు, ప్రిడియాట్రిక్ డాక్టర్లు అవసరం. అదే విధంగా శానిటేషన్ సిబ్బంది 30 మంది, సిస్టర్లు 15 మంది, ల్యాబ్ టెక్నీషియన్లు, ఎక్స్‌రే సిబ్బంది, ఎంఎన్‌వోస్, ఎఫ్ఎన్‌వోలు ముగ్గురేసి చొప్పున కావాలి. సిబ్బందితోపాటు చోరీకి గురైన సామాగ్రి ఏర్పాటుకు రూ.పది లక్షల నిధులు అవసరమని అధికారులు తేల్చారు.

లారీ, ద్విచక్రవాహనం ఢీకొని..

మహిళ మృతి



మమత(ఫైల్)

మక్తల్, జూన్ 19 : లారీ, ద్విచక్ర వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మక్తల్ మండలం అనుగొండ గ్రామానికి చెందిన మమత (43) తన భర్త సంజీవ్‌తో కలిసి సరకులు కొనుగోలు చేసేందుకు మక్తల్‌కు వచ్చారు. అనంతరం తిరిగి గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ముందు వెనకి నుంచి వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి మమతపై దూసుకుపోయింది. ఈ సంఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా సంజీవ్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. లారీ డ్రైవర్ అజాగ్రత్త వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. కాగా సంజీవ్ మొదటి భార్య మృతి చెందగా పదేళ్ల క్రితం మమతను వివాహం చేసుకున్నాడు. వీరికి ఎనిమిదేళ్ల కుమార్తె ఉంది. మొదటి భార్యకు ఓ కుమారుడు ఉన్నాడు. ఈ సంఘటనపై మొదటి భార్య కుమారుడు దత్తు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

చెట్ల పొదల్లో మృత శిశువు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామేశ్వర్, ఏఎస్ఐ చంద్రయ్య

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 19: చెట్ల పొదల్లో మృతి చెందిన ఆడ శిశువు కన్పించింది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నాగనూల్ రోడ్డులో చోటు చేసుకున్నట్లు ఏఎస్ఐ చంద్రయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... గొర్రెల కాపరి కాటమోని చెన్నమ్మ గొర్రెలను మేపుకుంటుండగా జిల్లా కేంద్రంలోని నాగనూల్ రోడ్డులో గల శ్మశానవాటిక సమీపంలో ఉన్న వెంచర్‌లోని చెట్ల పొదల్లో బ్యాగు కన్పించడంతో పరిశీలించింది. ఆ బ్యాగులో మృతి చెందిన శిశువు ఉండడంతో పోలీసులకు సమాచారం అందించింది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ రామేశ్వర్ పరిశీలించాడు. శిశువు మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇసుక తరలింపునకు అనుమతివ్వండి

- తహసీల్దార్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి

మూసాపేట (భూత్పూర్), జూన్ 19 : మండలంలో ప్రసిద్ధమైన శ్రీరామలింగే శ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారి నిర్మాణానికి ఇసుకకు అనుమతులు ఇవ్వాలని తహసీల్దార్ బ్రహ్మం గౌడ్‌కు పలువురు కాంగ్రెస్‌నాయకులు వినతిపత్రం అందజేశారు. దాతల సహాయంతో నిర్మించాలని నిర్ణయించామని, ఈ రహదారి నిర్మాణం కోసం ఇసుకకు అనుమతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ టీసీ సభ్యుడు జి.రామన్‌గౌడ్, బాలనర్సింహులు, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, నా యకులు తిరుపతయ్య, నరేందర్, రాజేశ్‌గౌడ్, మహేందర్, కృష్ణ, గోవర్ధన్‌తో పాటు మూసాపేట, సంకలమద్ది, వేముల, తుంకినీపూర్ గ్రామ భక్తులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

వంగూరు, జూన్ 19 : నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని డిండిచింతపల్లి వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పోలీస్‌లు పట్టుకున్నారు. వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాటిపై విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భూత్పూర్, జూన్ 19 : అతివేగంగా వెళుతున్న మోటార్ సైకిల్ అదుపు తప్పి బోల్తా పడటంతో ఓ వ్యక్తి మరణించగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం గుడిసెబండ గ్రామానికి చెందిన దొడ్డిపల్లి వెంకటరామయ్య(40) లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మండలంలోని అమిస్తాపూర్‌లో ఉన్న నావెల్‌టెక్ కంపెనీకి మంగళవారం లారీలో దాణాలోడ్ తీసుకువచ్చాడు. అనంతరం తనతో పాటు వచ్చిన మరో డ్రైవర్ సిద్దిరామయ్యను కంపెనీకి చెందిన మోటార్ సైకిల్ తీసుకుని భూత్పూర్‌కు వెళ్లి అక్కడ భోజనం చేశారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో వెంకటరామయ్య మోటార్ సైకిల్‌పై తిరిగి అమిస్తాపూర్‌లోని కంపెనీకి బయలుదేరాడు. అమిస్తాపూ ర్ సాక్షిగణపతి దేవాలయం దగ్గర వెంకటరామయ్య వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన వీరిని జనరల్ ఆసుపత్రికి తరలించగా బుధవారం చికిత్సపొందుతూ వెంకటరామయ్య మరణించాడు. మృతుడి బావమరిది బీరగాళ్లనాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

భూత్పూర్, జూన్ 19 : కడుపునొప్పి తాళలేక పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆటోడ్రైవర్ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. మండలంలోని పోతులమడుగుకు చెందిన బాబుమియా(52) ఆటోడ్రైవర్‌గా పని చేసేవాడు. కొంతకాలంగా కడుపునొప్పితో ఆసుపత్రికి చూయించుకున్నాడు. తరచూ కడుపునొప్పితో బాధపడేవాడు. ఈ క్రమంలోనే ఈనెల ఏడున పురుగుల మందుతాగి ఆత్మహత్యాయ త్నానికి పాల్పడగా చికిత్స నిమిత్తం జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. మృతుడి భార్య సర్దార్‌బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పీర్ల పండుగకు గుర్తింపునివ్వాలి

- పీర్ల పండుగ నిర్వాహకుల సంఘం నాయకులు



ఐక్యతను చాటుతున్న నాయకులు

పాలమూరు, జూన్ 19 : తెలంగాణ రాష్ట్రంలో పీర్ల పండుగను తెలంగాణ సాంస్కృతిక పండుగల జాబితాలో చేర్చాలని పీర్ల పండుగ నిర్వాహకుల సంఘం నాయ కులు రహీం, జిగట్టన్న డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామ గ్రామాన మొహర్రంను పీర్ల పండుగ పేరుతో కుల, మతాలకు అతీతంగా నిర్వహించుకోవటం ఆనవాయితీగా వస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పీర్ల పండు గకు పునర్జీవం పోస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎం.డి. సమీర్, అశోక్‌గౌడ్, ఎం.డి. మౌలానా, అనుమప్ప, బాబురావు, ఎడ్ల భాస్కర్, డి.నరసిం హులు, రఘు, మహిపాల్, నరేష్, మౌలాలి పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

చిన్నంబావి జూన్ 19 : ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని వెలగొండ గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయమ్మ అనే మహిళ పెబ్బేరు నుంచి కొల్లాపూర్ వెళ్లే బస్సులో స్వగ్రామానికి వచ్చింది. బస్సు దిగి ముందు నుంచి రోడ్డు దాటుతుండగా డ్రైవర్ నిర్లక్ష్యంతో ముందుకు నడిపాడు. దాంతో బస్సు మహిళను ఢీకొనడంతో ఒక్క సారిగా కుప్పకూలిపోయింది. రక్తపు గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

బస్సు సౌకర్యం లేని వంగూరు

» తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు, విద్యార్థులు

» పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

వంగూరు, జూన్ 19: ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపులేని మూలంగా వంగూరుకు అసలు ఆర్టీసీ బస్సే వెళ్లడం లేదు. ఇక మండలానికి రవాణా సౌకర్యం మరింతగా మెరుగుపడుతుందని అనుకున్న ప్రజలకు నిరాశే మిగిలింది. మండల కేంద్రానికి బస్సు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. ఆర్టీసీ అధికారులు కలెక్షన్ వస్తలేదనే సాకుతో గత పదిహేను రోజులుగా బస్సులను రద్దు చేయడంతో పల్లె వాసులకు ఆటోలే దిక్కయ్యాయి. వంగూరుతో పాటు ఇప్పటికీ కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో మహాలక్ష్మి పథకాన్ని ఆయా గ్రామాల మహిళలు, యువతులు, విద్యార్థినులు వినియోగించుకోలేని పరిస్థితి.


నడిచి వెళ్తున్న విద్యార్థినులు


ఆటోలో కిక్కిరిసి వెళ్తున్న మహిళలు

ఆటోలే దిక్కు...

వంగూరుతో పాటు మండలంలోని కొన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు వెళ్లడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు ఆటోలే దిక్కుగా మారాయి. ఇదే అదునుగా భావించి ఆటోలు ఇతర వాహనాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో పాటు అందిన కాడికి దుండుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. కోవిడ్ కంటే ముందు చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం ఉండేది. కరోనా అనంతరం నష్టాల సాకుతో బస్సులను రద్దు చేశారు. కల్వకుర్తి నుంచి వయా వంగూరు మీదుగా ఉమ్మాపూర్-డిండి బస్సు ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేది. ఇట్టి బస్సును ఆర్టీసీ అధికారులు పూర్తిగా రద్దు చేశారు.

బస్సు సౌకర్యం లేని గ్రామాలు

వంగూరుతో పాటు సర్వారెడ్డిపల్లి, నర్సంపల్లి, కోనేటిపూర్, వెంకటాపూర్, మాచినేనిపల్లి, తుమ్మలపల్లి, ఉల్లంపల్లి, వెల్మలపల్లి, చాకలిగుడిసెలు, ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. దీంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఆర్టీసీ అధికారులు స్పందించి గ్రామాలకు బస్సును నడపవల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిత్యం నడిచి వెళ్తున్నాం



వంగూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. మా గ్రామానికి బస్సు రద్దు చేయడంతో నిత్యం నడుచుకుంటూ 3 కిలోమీటర్లు వంగూరుకు స్కూల్‌కు వెళ్తున్నాం. తిరిగి సాయంత్రం ఇంటికి కాలినడకన చేరుకునే సరికి చీకటి పడుతోంది. బస్సును మళ్లీ నడిపిస్తే బాగుంటుంది.

- భువనేశ్వరి, విద్యార్థిని, వెంకటాపూర్

బస్సులను వేయిస్తాం..

రద్దు చేసిన డిండి-ఉమ్మాపూర్ బస్సును పునరుద్ధరిస్తాం. పాఠశాలలు పునప్రారంభం అయిన దృష్ట్యా బస్సును త్వరగానే నడిపిస్తాం. సెలవుల్లో ఎవ్వరూ ఎక్కడం లేదని బస్సును రద్దు చేశాం. మండల కేంద్రం మీదుగా బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకుంటాం.

- శ్వేత, సీఐ, ఆర్టీసీ డిపో, కల్వకుర్తి

రోగి బంధువుపై దాడికి యత్నించిన వైద్యుడు

» అడ్డుకొని వేడుకున్న రోగి, కుటుంబ సభ్యులు

» సోషల్ మీడియాలో వీడియో వైరల్

గద్వాల క్రైం, జూన్ 19 : వైద్యం కోసం వచ్చిన రోగి కుటుంబ సభ్యుడిపై వైద్యుడు దాడికి యత్నించాడు. దీనికి సంబంధించిన వీడియో మీడియాలో వైరల్ అయ్యింది. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గంజిపేట కాలనీకి చెందిన ఓ మహిళ వైద్యం కోసం మంగళవారం సాయంత్రం కుటుంబసభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చారు. ఆమెకు వైద్యుడు సకాలంలో వైద్యం అందించకపోవడంతో ఆమె వెంట వచ్చిన వారిలో ఒకరు వైద్యుడిని ప్రశ్నించారు. ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే వైద్యం చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆ వైద్యుడు అతడిపై పక్కనే ఉన్న కుక్క బొమ్మతో దాడికి యత్నించాడు. దీంతో రోగి వెంట కుటుంబ సభ్యులు అతడిని వదిలి వేయాలంటూ వేడుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ఆన్‌లైన్లో వైరల్‌గా మారింది. ఈ విషయంపై సదరు వైద్యుడిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎవరు ఊరుకుంటారని బదులిచ్చారు. అయితే ఈ విషయంపై ఇరువురి మధ్య రాజీ కుదిరినట్లు సమాచారం.

ఉప్పునుంతలలో రోగిపై దురుసు ప్రవర్తన

ఉప్పునుంతల: నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం కంసానిపల్లి గ్రామానికి చెందిన కీమర్ల నారమ్మ వారి బంధువు అనంతమ్మను ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యం చేయకుండా తాత్కాలిక వైద్య సిబ్బంది వరమ్మ దురుసుగా ప్రవర్తించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా సమన్వకర్త రమేష్‌చంద్ర దురుసుగా ప్రవర్తించిన వరమ్మకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని మెడికల్ ఆఫీసర్‌కు సూచించినట్లు వైద్యాధికారి తెలిపారు. మొదటిసారి కావడంతో షోకాజ్ నోటీసు ఇవ్వడం జరిగిందని, మళ్లీ పునరావృతమైతే ఉద్యోగం నుంచి తొలగించడం జరుగుతుందని ఆయన హెచ్చరించినట్లు తెలిపారు.

జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

జడ్చర్ల, జూన్ 19 : జడ్చర్ల మండలం గొల్లపల్లి సమీపంలోని జిన్నింగ్ మిల్లులో బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పులు వచ్చి పత్తిపై పడడంతో మంటలు రేగాయి. సంఘటన స్థలానికి జడ్చర్ల అగ్నిమాపక శాఖ అధికారులు ఫైర్‌ఇంజన్‌తో చేరుకుని, మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కాగా ఈ సంఘటనలో సుమారు రూ. 4.50లక్షల విలువగల ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కృష్ణ(ఫైల్)

తిమ్మాజిపేట, జూన్ 19 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని రాళ్లచెరువుతండాకు చెందిన కేతావత్ కృష్ణ(45) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన కృష్ణను వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సక్రి, కుమార్తె, కుమారుడు ఉన్నారన్నారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

జడ్చర్ల, జూన్ 19 : జడ్చర్ల మండలం పెద్దఆదిరాల గ్రామానికి చెందిన దొబ్బల శివరాములు కనిపించడం లేదంటూ అతని కుమార్తె నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఈ నెల 17న రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి, నిద్రించారని, మధ్యరాత్రి మూడు గంటల సమయంలో కుటుంబ సభ్యులు చూడగా కనిపించలేదని, శివకుమార్ ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారని తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

భూత్పూర్, జూన్ 19 : మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్ తనిఖీ చేశారు. ప్రాథమిక వ్యవసాయ కేంద్రంతో పాటు పలు షాపులను తనిఖీ చేసి ఎరువుల నిలువలను పరిశీలించారు.


దుకాణాలలో వివరాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ అధికారి

యూరియా, డీఏపీ ఇతర ఎరువుల రికార్డులను పరిశీలించి ఆధార్ నమోదు ద్వారానే రైతులకు ఎరువులు ఇవ్వాలని సూచించారు. అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో సీఈవో రత్నయ్య, మండల వ్యవసాయ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

తవ్వకాల్లో బయటపడిన అమ్మవారి విగ్రహం

» అడివేశ్వర స్వామి ఆలయంలో ప్రతిష్ఠ

రాజోలి, జూన్ 19 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్ర సమీపంలోని తుంగభద్ర నదీ తీరంలో ఫైబర్ నెట్ కేబుల్ లైన్ కోసం తవ్వకాలు నిర్వహిస్తుండగా అమ్మవారి విగ్రహం బయటపడింది. గమనించిన ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ విగ్రహాన్ని తీసి పక్కన పెట్టారు. విషయం తెలిసిన గ్రామస్థులు, యువకులు ఆ విగ్రహాన్ని గ్రామంలోని భ్రమరాంబికా అడివేశ్వర స్వామి ఆలయ సమీపంలోని నాగప్ప వద్ద ప్రతిష్ఠించి పూజలు చేశారు.


అడివేశ్వర స్వామి ఆలయ నాగప్ప కట్టపై విగ్రహాన్ని ప్రతిష్ఠించిన యువకులు


బయటపడ్డ అమ్మవారి రాతి విగ్రహం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మానవపాడు, జూన్ 19 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మహబూబ్ బాషా, షేక్షావలి, సుంకన్న బాబులు ద్విచక్రవాహనంపై మానవపాడు నుంచి జల్లాపురం స్టేజీ వైపు వెళ్తుండగా క్రాస్ రోడ్డు సమీపంలో డివైడర్‌ను ఢీకొని కిందపడ్డారు. ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని స్థానికులు మానవపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.


బోల్తాపడిన ఆటోను ఎత్తుతున్న స్థానికులు

ఆటో బోల్తా

అయిజ: జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డోన్ పట్టణం నుంచి మల్దకల్ మండల కేంద్రానికి ఇనుప రేకులు, పైపుల లోడ్‌తో వస్తున్న ఆటో వెంకటాపూర్ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

కొత్తకోటలో చైన్ స్నాచింగ్

కొత్తకోట, జూన్ 19 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చైన్ స్నాచింగ్ కేసు నమోదు అయినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఎస్సై వివరాల మేరకు పాలెం గ్రామ శివారు జాతీయ రహదారిపై హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద పెద్దమందడి మండల మద్దిగట్ల గ్రామానికి చెందిన కొత్తకాపు శ్రీదేవి స్మాల్ టీ హోటల్ నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి టీ తాగాడు. టీ బిల్లు చెల్లించిన వెంటనే శ్రీదేవి మెడలో ఉన్న 3.5 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకోని రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొరాయిస్తున్న మోటార్లు

» మరమ్మతుల పేరుతో కాలయాపన

» 35 గ్రామాలకు తప్పని తిప్పలు

గోపాల్‌పేట, జూన్ 19: మండల కేంద్రంలో రామన్‌పాడ్ ప్రధాన పంప్‌హౌస్‌లో రెండు మోటార్లు మొరాయిస్తుండటంతో గ్రామాలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం ప్రాజెక్ట్ వెనుకాల ఉన్న రా నీళ్లను తీసుకోని గుడిపల్లి మీదగా గోపాల్‌పేటలో ఉన్న రామన్‌పాడ్ ప్రధాన పంప్‌హౌస్‌కు తరలిస్తారు. ఇక్కడ శుద్ధి చేసిన నీళ్లను రేవల్లి, గోపాల్‌పేట, వనపర్తి మండలాల పరిధిలోని గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తారు. పంప్‌హౌస్‌లో రెండు మోటార్లు రెగ్యులర్‌గా పని చేస్తుంటాయి. ఒక మోటారును స్టాండ్‌బైగా ఉచ్చారు. మొత్తం 55 గ్రామాలకు తాగునీరు అందిస్తుంది. అయితే, నెలరోజుగా రెండు మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. స్టాండ్‌బైగా ఉంచిన మోటారుతో పనిని జరుపుతున్నారు. 30 రోజుల వ్యవధిలో రెండు మోటార్లను ఐదుసార్లు మరమ్మతు చేయించినా ప్రయోజనం లేకుండా పోయింది. దాంతో గోపాల్‌పేట, రేవల్లి, వనపర్తి మండలం పరిధిలోని దాదాపు 35 గ్రామాల ప్రజలకు తాగునీరు తిప్పలు తప్పడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు మరమ్మతుల పేరుతో కాలయాపన చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తరుచూ రిపేరు అయ్యే పంపులను బిగించి అధికారులే ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. మిషన్ భగీరథ జిల్లా అధికారులు స్పందించి పంపులు మరమ్మతులు త్వరగా పూర్తి చేసి తాగునీరుకు ఇబ్బంది కలుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


రామన్‌పాడు పంప్‌హౌస్

నీళ్లు రావడం లేదు

గ్రామంలో తాగునీరు రెండు మూడు రోజులకి ఒక సారి వస్తుంది. గ్రామ వాటర్‌మ్యాన్ అడుగుతే పంప్‌హౌస్‌లో మోటార్లు చెడిపోయినట్లు చెబుతున్నారు. నెలలో ఐదుసార్లు మోటార్లు రిపేరు అవుతాయా? తాగునీటికి ఇబ్బంది కలుగకుండా చూడాలి.

- సుగుణమ్మ, గోపాల్‌పేట

పంపు మరమ్మతులు పూర్తి చేశాం

మోటార్లు రిపేరు కావడంతో స్టాండ్‌బై ఉన్న వాటిపై ఒత్తిడి పడింది. దాంతో కొంత వరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మోటార్లు మరమ్మతులు చేయించినా మళ్లీ మొరాయిస్తున్నాయి. ఈసారి జడ్చర్లలో మరమ్మతులు చేయించాం. అన్ని గ్రామాలకు పూర్తిగా నీటిని అందిస్తాం. ఇకపై ప్రజలకు ఇబ్బంది రాకుండా చేస్తాం.

- మొగులయ్య, ఏఈ (మిషన్‌భగీరథ)

రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెబ్బేరు, జూన్ 19: పెబ్బేరు మునిసిపాలిటీలోని సుభాష్‌చౌరస్తా నుంచి వనపర్తి వెళ్లే రహదారి పీజేపీ కెనాల్ వరకు రోడ్డు విస్తరణ పనులు, రోడ్డు ఇరువైపులా డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని కాంగ్రెస్ నాయకులు అక్కి. శ్రీనివాస్‌గౌడ్, భాను ప్రకాష్‌రెడ్డి, షకిల్, వినయ్ కోరారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ ఆదిశేషుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పెబ్బేరు మునిసిపాలిటిలో రోడ్ల విస్తరణ పనులతో పాదాచారులు, వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలోగా రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు.

కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు


హోమం చేస్తున్న భక్తులు

కొత్తకోట, జూన్ 19 : మండలంలోని కానాయపల్లి గ్రామంలో ఉన్న సుప్రసిద్ధమైన శైవక్షేత్రం కోటిలింగేశ్వరస్వామి దేవాలయంలో 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమైయ్యాయి. రాయచూరు కిల్లేర్ బృహన్మఠధీశ్వరులు 108 సావిక దేవర సంస్థాన మఠాధిపతులు మహేశ్వర వేద పండితులచే సంకల్ప సిద్ధి కాలభైరవ పాశుపతి హోమాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ప్రధాన కార్యదర్శి శేఖరయ్య, ఆలయ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, నిర్వాహకులు విశ్వనాథ్, జగదీశ్వర్ అన్నదానం చేశారు.

ఆన్‌లైన్ రుణాలకు దూరంగా ఉండాలి

కొత్తకోట, జూన్ 19 : విద్యార్థులు ఆన్‌లైన్ రుణాలకు దూరంగా ఉండాలని ఎస్సై మంజునాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని నివేదిత డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బ్యాంకు లావాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సొసైటీ రిసోర్స్‌పర్సన్ అంబికా శశికళ, మంజునాథ్‌రెడ్డి మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లు అందుబాటులోకి వచ్చాక కొందరు తెలిసి తెలియక వచ్చే లింక్‌ను ఒపెన్ చేస్తే మన డాటాతో పాటు నగదును కోల్పోతున్నరని గుర్తు చేశారు. ప్రతీ విద్యార్థి బ్యాంకు ఖాతాలు తీసుకొని నేరుగా లావాదేవీలు చేసుకోవాలన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ సహదేవుడు, సొసైటీ కోఆర్డిటర్ శేఖర్‌రెడ్డి, రిసోర్స్‌పర్సన్ అబంకా శశికళ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

ఖిల్లాఘణపురం, జూన్ 19: రక్తహీనతకు ప్రధాన కారణం పోషకాహార లోపమే అని గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి.సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణంలో సికిల్ సెల్ అనీమియా (రక్తహీనత) వ్యాధిపై బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులకు, తల్లిదండ్రులకు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పి.సత్యనారాయణ మాట్లాడుతూ రక్తహీనత లేని సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయ బృందం, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయాలి'

అమరచింత,జూన్ 19: ఖరీఫ్ సాగు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జూరాల ప్రధాన ఎడమ కాలువతో పాటు సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల నుంచి సాగునీటిని తక్షణమే విడుదల చేయాలని టీడీపీ అమరచింత మండల అధ్యక్షుడు మోదీ మనోహర్ రాజు శెట్టి కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు నిర్మాణం కోసం ఈ ప్రాంత రైతులు భూములను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనంతో కొంద రు వనపర్తి, కొల్లాపూర్ ప్రాంతాలకు ఇక్కడ నీటిని తరలించుకుపోవడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఈ ప్రాంత రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని సాగునీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇంటింటికీ మిషన్ భగీరథ

వీపనగండ్ల,జూన్19: ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్ళు అందిస్తామని ఏఈ ఉదయ్ తెలిపారు. గ్రామాలలో ఇంటింటి సర్వే తిరిగి మిషన్ భగీరథ కనెక్షన్ వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ కనెక్షన్ లేని ఇళ్లను గుర్తించి వారికి కనెక్షన్ ఇచ్చే ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. సర్వే చేస్తున్న వారికి ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతీ ఇంటికి నీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

సీబీఐతో విచారణ జరపాలి

- ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్

ఆత్మకూరు,జూన్19: నీట్‌లో జరిగిన అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని నీట్ ప్రవేశ పరీక్షలు మళ్లీ ని ర్వహించాలని విద్యార్థులకు న్యాయం చేయాలని ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ డిమాండ్ చేశారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంటర్, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల విద్యార్థులతో కలిసి బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ ఆత్మకూరు మండల అధ్యక్షుడు జుబేర్ అహ్మద్ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ ర్యాలీ

అమరచింత,జూన్ 19: ప్రతీ విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శరత్ కుమార్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని నాగల్‌కడుమూర్ గ్రామంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్ కుమార్, సూపర్‌వైజర్ సురేందర్ గౌడ్, ఏఎన్‌ఎం ఉమామహేశ్వరి, ఆశా కార్యకర్తలు బాలీశ్వరి, నరసింగమ్మ పాల్గొన్నారు.

'మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ఆత్మకూరు,జూన్ 19: మునిసిపల్ కార్మికులకు మూడు సంవత్సరాల క్రితం పెంచిన 30 శాతం వేతనాన్ని అమలు చేస్తూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు జిల్లా కోశాధికారి రాజు, నాయకులు వెంకటన్న, మునిసిపల్ కార్మికులు జమ్మన్న, రాధా, మణెమ్మ, సత్తెమ్మ, లక్ష్మి, దశరథ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య

ఆత్మకూరు,జూన్ 19: ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్యను అందిస్తున్నామని ఆత్మకూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డీఎస్ రాజేశ్వరరావు అన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని జూనియర్ కళాశాల అధ్యాపకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాగ్యవర్ధన్ రెడ్డి, విశ్వేశ్వర్, కురుమూర్తి, రాఘవేంద్రరావు, జమ్మన్న, శ్వేత, వీణ, లలితమ్మ, సునీల్ కుమార్, పావని, రాఘవేందర్, లైబ్రేరియన్ చైతన్య రాణి, జూనియర్ అసిస్టెంట్ గోపాల్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

అమరచింత,జూన్19: ప్రభుత్వ భూములు, వెంచర్‌లో ఉన్న 10శాతం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ అన్నారు. బుధవారం ఆయా వెంచర్లలో ప్రభుత్వ భూములను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఉద్యోగులు కృష్ణయ్య, ప్రభాకర్, బాబు, లక్ష్మయ్య, కృష్ణయ్య, మునిస్వామి, గోపాల్, చిన్న పాల్గొన్నారు.

'బీడీ కార్మికులపై చిన్నచూపు తగదు'

అమరచింత,జూన్19: బీడీ కార్మికులపై బీడీ ఫ్యాక్టరీ యజమానులు చిన్నచూపు చూడడం తగదని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం పేర్కొన్నారు. బుధవారం అమరచింత మార్క్స్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ కార్మికులకు గ్రావిటీ విషయంలో యజమానులు నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. సమావేశంలో సామేల్, జయం, దేవదానం, కోళ్ల వెంకటన్న, వెంకటేష్ గౌడ్, సి.రాజు పాల్గొన్నారు.

పడకేస్తున్న పాలన

- ఐదు నెలలుగా సాధారణ సమావేశానికి నోచుకోని పురపాలకం
- జనవరిలో జరిగిన బడ్జెట్ సమావేశమే చివరిది
- ప్రతీ నెల జరగాల్సిన కౌన్సిల్‌పై నీలి నీడలు
- సమావేశం జరుగకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే

వనపర్తి టౌన్, జూన్ 19: వనపర్తి మునిసిపాలిటీలో పరిపాలన వ్యవస్థ పడకేస్తుంది. ప్రజా సమస్యలు వెలికితీసి వాటి పరిష్కారం కోసం కృషి చేయాల్సిన పాలక వర్గం ఆ దిశగా గత ఐదు నెలలుగా ఒక్క అడుగు కూడా ముందుకేయడం లేదనే చెప్పాలి. ప్రతీ నెల పురపాలక సంఘం ఆధ్వర్యంలో సాధారణ సమావేశం ఏర్పాటు చేసి, ప్రజల సమస్యలను సమావేశంలో చర్చించి, వాటి పరిష్కారం కోసం కౌన్సిల్ సభ్యులు పని చేయాల్సి ఉంటుంది. కానీ ఐదు నెలలుగా కౌన్సిల్ సమావేశం జరగడమే లేదు. ఇక ప్రజల సమస్యలు పరిష్కారం ఎలా అవుతాయి? మునిసిపాలిటికి రావాల్సిన ఆదాయం ఎలా సమకూరుతుందని పలువురు కౌన్సిల్ సభ్యులు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు. ప్రతీ నెల క్రమం తప్పకుండా నిర్వహించకపోవడంతో అధికారులకు జవాబుదారి తనం ఏమాత్రం పట్టడం లేదని, పరిపాలన వ్యవస్థత, ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అనే విధంగా మారిందని ఆరోపిస్తున్నారు.

పదవి కోసమే పాకులాట...

ఈ ఏడాది జనవరిలో పురపాలక సంఘం బడ్జెట్ సమావేశం నాటి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సమక్షంలో నిర్వహించారు. అప్పటి నుంచి నేటి వరకు మునిసిపల్ సాధారణ సమావేశం అనే మాటే కరువైంది. బడ్జెట్ సమావేశం జరిగిన తరువాత అప్పటి కమిషనర్ విక్రమసింహరెడ్డి బదిలీపై వెళ్లారు. అనంతరం వనపర్తి మునిసిపాలిటీకి కమిషనర్‌గా రావాలంటేనే కొందరు అధికారులు అయిష్టత కనబర్చారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించాలనే ధ్యాస అధికారుల్లో కూడా లేకుండాపోయింది. ఇక అక్కడి నుంచే అసలు తతంగం ప్రారంభమైంది. ఫిబ్రవరి లోనే మునిసిల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస ప్రవేశపెట్టాలన్న చర్చ విస్తృతంగా ప్రజల్లోకి చేరింది. మార్చి 18న ఆనాటి చైర్మన్, వైస్ చైర్మన్ వ్యక్తిగత కారణాలు చూపుతూ తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామాలకు కలెక్టర్ ఆమోదం తెలపడం, కొత్త పాలక వర్గం ఎన్నికకు కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం, పదవి దక్కించుకోవడం కోసం అప్పటి చైర్మన్, వైస్ చైర్మన్‌లు పాకులాడటం, ఎలాగైన వనపర్తి పురపీఠాన్ని కైవసం చేసుకోవాలనే తపనలో నేటి చైర్మన్, వైస్ చైర్మన్‌లు పావులు కదపడంతోనే రోజులు గడిచిపోయాయి. ఎట్టకేలకు ఏప్రిల్ 6న వనపర్తి పురపీఠం కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అయినా నేటికీ కౌన్సిల్ సమావేశం జరగడం లేదు. సమస్యలపై చర్చించడం లేదు.


వనపర్తి పురపాలక సంఘ కార్యాలయం

ఆదాయం ఆవిరి....

మునిసిపాలిటీలకు ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటిగా చెప్పుకునే తైబజార్, వారపు సంతా, జంతు వధశాల వంటివి ప్రధానమైనవి. వాటి ద్వారా మునిసిపాలిటీకి లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. కానీ వనపర్తి మునిసిపాలిటీలో మాత్రం పరిపాలన వ్యవస్థ గడిచిన ఐదు నెలలుగా పడకేయడంతో ఆదాయం కాస్త ఆవిరైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతేడాది బహిరంగ వేలంలో రూ. 28లక్షలు పలికిన తైబజార్ అనుకోని కారణాలతో మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించాల్సిన తైబజార్ వేలం కూడా ఇప్పటికీ నిర్వహించలేదు. అదేమిటంటే ఎన్నికల కోడ్ ఉండటంతో నిర్వహించలేదని అధికారులు బదులిస్తున్నారు. కానీ మునిసిపాలిటీకి ఆదాయం సమకూర్చుకోవడం కోసం కలెక్టర్‌కు నోట్‌ఫైల్ పెట్టి కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలతో వేలం నిర్వహించుకోవాలన్న ధ్యాస అధికారులు మరిచిపోయారు. అధికారులు, పాలకవర్గ సభ్యులు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ఉండటంతో మునిసిపల్ ఆదాయంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కూడా గాలిలో దీపంలా మారింది.

ఈనెలలో తప్పకుండా నిర్వహిస్తాం



ఈనెల 15న మునిసిపల్ సాధారణ సమావేశం నిర్వహించాలనుకున్నాం. కానీ కొన్ని అనివార్య కారణాలతో సమావేశం వాయిదా పడింది. ఈనెల చివరిలో తప్పకుండా నిర్వహిస్తాం. ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల సందర్భంగా వరుసగా వచ్చిన ఎన్నికల కోడ్ కారణంగా సమావేశాలు నిర్వహించలేకపోయాం. ఈ నెల చివర్లో నిర్వహించే సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారం పైనే దృష్టి సారిస్తాం.

- పూర్ణచందర్, మునిసిపల్ కమిషనర్, వనపర్తి

బాలికలు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహించాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి


నగదు ప్రోత్సాహం అందజేస్తున్న చిన్నారెడ్డి, మేఘారెడ్డి, అధికారులు

వనపర్తి రూరల్, జూన్ 19: బాలికలు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రతీ ఒక్కరు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. గ్రామస్థాయిలో తెలుగు మీడియం ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలికలకు బుధవారం వనపర్తి పట్టణంలోని ఓ ప్రైవేటు హాల్లో గ్రామీణ భాగస్వామ్య సంస్థ (వీఐపీ) ఆధ్వర్యంలో బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన బాలికలకు వీఐపీ సంస్థ తరపున రూ.ఐదు వేల నగదు బహుమతి, రూ.20 వేల ఫిక్సడ్ డిపాజిట్‌లను ప్రదానం చేశా రు. అదే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం, పాఠశాలకు, గ్రామ పంచాయతీకి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ పేదరికాన్ని అక్షరాస్యత ద్వారా నిర్మూలించగలమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టాటా గ్రూప్‌తో ఒప్పందం చేసుకుని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఎన్నో మంచి కార్యక్రమాలు వీఐపీ సంస్థ చేపడుతుండడం ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుందన్నారు. వీఐపీ సంస్థ ఎన్నో ఏళ్ల నుంచి జిల్లాలో అనేక మంచి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అన్ని దానాలోకెల్లా విద్య దానం గొప్పదని అదనపు కలెక్టర్ రెవెన్యూ నగేష్ అన్నారు. ఆ దిశగా వీఐపీ సంస్థ బాలిక విద్యను ప్రోత్సహించడం ప్రశంసనీయం అన్నారు. సమావేశంలో ఆర్డీవో పద్మావతి, వీఐపీ సంస్థ ఈడీ నాగేంద్ర స్వామి, డీఈవో గోవింద రాజులు, మునిసిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, నాయకులు బి.కృష్ణ, కదిరె రాములు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

24న హాకీ క్రీడాకారుల ఎంపిక

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 19: జిల్లా హాకీ అకాడమీలో ఖాళీల భర్తీ కోసం క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్ కుమార్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24, 25వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య మినీ స్టేడియంలో ఎంపికలు ఉంటాయన్నారు. ఈ ఎంపికలలో పాల్గొనే బాలురు 31.08.2024 నాటికి 16 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన బాలురు ఈనెల 24న ఉదయం 8గంటల లోగా అవసరమైన ధృవపత్రాలతో స్టేడియంలో రిపోర్టు చేయాలన్నారు. సెలక్షన్లకు వచ్చేవారు పది పాస్‌పోర్టు సైజు ఫొటోలు, పాఠశాల నుంచి పొందిన జనన ధ్రువీకరణ పత్రం, తహసీల్దార్ లేదా మునిసిపాలిటీ నుంచి పొందిన జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్, ఇది వరకు ఏమైనా హాకీలో ఆడి ఉంటే వాటికి సంబంధించిన సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 19: సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2025 కోసం సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నుశిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిలిమ్స్ కం మెయిన్ బ్యాచ్ ప్రవేశం కోసం జూలై 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 10 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఈ కేటగిరీ అభ్యర్థులు జూన్ 17నుంచి జూలై 10లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. అభ్యర్థులు ఏదైనా జనరల్ డిగ్రీ లేదా ప్రొఫెషనల్ డిగ్రీ పాసై ఉండాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపు మాత్రమే ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలను హెచ్‌టీటీపీ://టీఎస్‌స్టడీసర్కిల్.ఇన్/ అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె సూచించారు.

నులిపురుగుల మాత్రలు పంపిణీ చేయాలి

వనపర్తి వైద్యవిభాగం, జూన్ 19: జిల్లాలో గుర్తించిన ప్రతీ ఒక్కరికీ నులి పురుగుల మాత్రలను పంపిణీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్ర మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేస్తామన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గల ప్రభుత్వ బాలికల పాఠశాలలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నా రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి హాజరై విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తారన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

వనపర్తి రూరల్,జూన్ 19: ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి మెరుగైన చికిత్స అందించాలని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి వైద్యులకు సూచించారు. వనపర్తి మండలం అంకూరు గ్రామానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి మహబూబ్‌నగర్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం ఆయన్ను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెల్టూరు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, జయపాల్‌రెడ్డి , నాయకులు పాల్గొన్నారు.

'నిందితులను కఠినంగా శిక్షించాలి'

వనపర్తి టౌన్, జూన్ 19: గిరిజన బాలిక అదృశ్యం, హత్యపై సమగ్ర విచారణ జరిపి హత్యకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శివ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి నిందితులు ఎంతటివారైన ఉపేక్షించేది లేదని, ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

'హామీలు అమలు చేయాలి'

పాన్‌గల్,జూన్ 19: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి తండాలో తెలంగాణ గిరిజన సంఘం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా నాయకులు బాలునాయక్, రవినాయక్ తదితరులున్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పాన్‌గల్, జూన్ 19: మండల పరిధిలోని మాధవరావు పల్లి ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంపీడీవో కోటేశ్వర్, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరస్వామి, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి శ్రీరాములు పాల్గొన్నారు.

రంగసముద్రానికి భీమా నీరు

శ్రీరంగాపురం, జూన్ 19: భీమా ఎత్తిపోతల నుంచి రంగసముద్రం రిజర్వాయర్‌కు నీరు చేరింది. దాంతో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, జడ్పీటీసీ సభ్యుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, నాయకులు పూలు చల్లారు. నాయకులు రాములుయాదవ్, ఎల్లస్వామి యాదవ్, రమేష్, అశోక్‌రెడ్డి, రాజగౌడ్, నారాయణస్వామి పాల్గొన్నారు.

యువత అగ్నివీర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- వాయుసేన రిసోర్స్ పర్సన్, కల్నల్ వి.సందీప్


సదస్సులో మాట్లాడుతున్న కల్నల్ వి.సందీప్

వనపర్తి రూరల్, జూన్19: దేశ రక్షణతో పాటు మంచి కెరీర్ సాధించడానికి యువత అగ్నివీర్‌ను సద్వినియోగం చేసుకోవాలని వాయుసేన రిసోర్స్ పర్సన్, కల్నల్ వి.సందీప్ పిలుపునిచ్చారు. బుధవారం వనపర్తి జిల్లాలోని బాలుర డిగ్రీ కళాశాల ఆడిటోరియం హాల్లో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన అగ్నివీర్ అవగాహన సదస్సులో కల్నల్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అగ్నివీర్‌పై అవగాహన కలిపిస్తూ సందేహాలను నివృత్తి చేశారు. 17నుంచి 21 సంవత్సరాల వయసు కలిగిన యువతీ యువకులు అగ్నివీర్‌లో చేరి దేశ రక్షణలో తమ వంతు పాత్ర పోషించడమే కాకుండా ఉపాధి పొందవచ్చు అన్నారు. అగ్నివీర్‌లో వాయుసేన, నేవి, ఆర్మీ అనే మూడు విభాగాలు ఉంటాయని ఆయన తెలిపారు. ఎంపిక అయిన రోజు నుంచి నెలకు రూ.30వేల జీతం ప్రారంభం అవుతుందని ఆరు నెలల శిక్షణ పూర్తి అయ్యాక మూడు సంవత్సరాల ఆరు నెలల సర్వీస్ చేయాల్సి ఉంటుందన్నారు. అగ్నివీర్ లు సాయుధ దళంలో విశిష్టమైన ర్యాంకును కలిగి ఉంటారని, నాలుగు సంవత్సరాల వ్యవధి పూర్తి అయిన తరువాత ఇతర రంగాలలో ఉపాధి కోసం క్రమ శిక్షణ , చైతన్యవంతమైన, ప్రేరేపిత , నైపుణ్యం కలిగిన వర్క్‌ఫోర్స్‌గా సమాజంలోకి తిరిగి వెళ్తారని తెలిపారు. నాలుగు సంవత్సరాల తరువాత అగ్నివీర్‌లకు రూ.11.71లక్షల సేవానిధి ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరు దేశ రక్షణలో సైనికులుగా కొంతకాలం సేవలు అందించేందుకు పటిష్టమైన దేశ భద్రత కోసం అగ్నివీర్ ప్రవేశ పెట్టినట్లు వివరించారు. సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ సుధీర్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ధాంసింగ్, లెక్చరర్ ఉమా, ఇతర లెక్చరర్‌లు, ఎన్‌సీసీ క్యాడెట్, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు వంద కుర్చీల వితరణ

కొత్తకోట, జూన్ 19 : మండలంలోని అమడబాకుల గ్రామంలోని మోడల్ స్కూల్‌కు జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రానికి చెందిన మధుగౌడ్ వంద కుర్చీలను బుధవారం అందజేశారు. మెరుగైన ఫలితాలు సాధిస్తున్న మోడల్ స్కూల్ భవిష్యత్‌లో రాష్ట్రంలోనే ఉత్తమంగా రాణించాలని మధుగౌడ్ ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి ఉపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

'పుస్తకాల పేరుతో దోపిడీ'

వనపర్తి టౌన్, జూన్ 19: ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాల పేరుతో జరుగుతున్న దోపిడీకి అడ్డుకట్ట వేయాలని తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాదర్ పాషా డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ....ఒకటో తరగతి చదువు కుంటున్న పిల్లల పుస్తకాలకు రూ. నాలుగు వేలకు పైగా వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే టీజేఎస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అధిక ఫీజులు, పుస్తకాల దోపిడిపై ఫిర్యాదు చేస్తామని అన్నారు.

ప్రభుత్వ పాఠశాల పరిశీలన

శ్రీరంగాపురం,జూన్19: మండల పరిధిలోని నాగసానిపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను తహసీల్దార్ మురళి పరిశీలించారు. బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాల తరగతి గదులు, పైకప్పు పెచ్చులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తెస్తానని తహసీల్దార్ తెలిపారు.

తాటిపాముల మాజీ సర్పంచు మృతి

శ్రీరంగాపురం, జూన్19: మండలపరిధిలోని తాటిపాముల మాజీ సర్పంచు అనసూయమ్మ(85)మృతి చెందారు. ఉత్తమ సర్పంచ్‌గా గ్రామానికి సేవలందించారు. అనసూయమ్మ మృతి పట్ల గ్రామస్థులు సంతాపం తెలిపారు. కాగా బుధవారం మధ్యాహ్నం వనపర్తిలో ఆమె అంత్యక్రియలు జరిగాయి. అంత్యక్రియలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

దేశంలోని యువతకు స్ఫూర్తి రాహుల్ గాంధీ


శ్రీరంగాపురంలో కేక్‌కట్ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు, నాయకులు


ఎమ్మెల్యే మేఘారెడ్డికి కేక్ తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్/ఖిల్లాఘణపురం/అమరచింత/పెబ్బేరు/శ్రీరంగాపురం/కొత్తకోట/రేవల్లి, జూన్ 19: ప్రతిపక్షంలో ఉంటూ పదేళ్లుగా దేశంలోని ప్రజల కోసం పోరాటం సాగిస్తున్న రాహుల్ గాంధీ దేశంలోని యువతకు స్ఫూర్తి అని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పుట్టినరోజు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నందిమల్ల యాదయ్య, బి కృష్ణ, ఖమ్మర్ మియా, చెన్నరాములు, వెంటన్న, రాగివేణు, అబ్దుల్లా, వీణాచారి, ఎల్లయ్య, ఇర్షద్, నరేందర్‌రెడ్డి, రామకృష్ణ, నాగార్జున, వినోద్, భాస్కర్, దిలీప్, మెంటపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో..

భారత్ జోడో యాత్రతో దేశంలోని ప్రజలను ఐక్యమత్యం చేసిన భవిష్యత్ దేశ ప్రధాని రాహుల్ గాంధీ అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రలోని రాజీవ్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్‌చైర్మన్ పాకనాటి కృష్ణ, నాయకులు లక్కాకుల సతీష్, బండారు శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ పగిడాల శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ నాయక్, ఎస్‌ఎల్‌ఎన్ రమేష్, చుక్క రాజు పాల్గొన్నారు. ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అమరచింత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల బీసీ, ఎస్టీ, మైనార్టీ సెల్ , ఐఎన్‌టీయూసీ కార్మిక సెల్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. పెబ్బేరు మండల కేంద్రంలోని సుభాష్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. కొత్తకోట పట్టణ చౌరస్తాలో ఏఐసీసీ నాయకులు ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్, డాక్టర్ పీజే. బాబు, బీచుపల్లి యాదవ్, శ్రీనివాసులు, బోయెజ్, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, మిషేక్, లతీఫ్, సలీంఖాన్, రాంమోహన్‌రెడ్డి, గోకరయ్య, సాయులు యాదవ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. రేవల్లి, మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాడల పర్వతాలు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.